క్లుప్తంగా

ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ఎన్‌సీసీ కేడెట్



సాగర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీ జీఎస్‌ఆర్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ వి.సాగర్ గత నెలలో జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాల్లో పాల్గొన్నాడు. ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన ఏకైక కేడెట్ కావడం విశేషం. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డీ. జకీరుల్లా వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరెడ్డి, ఎన్‌సీసీ అధికారి జె.రమేశ్‌లు విద్యార్థిని అభినందించారు.

సత్తా చాటిన ‘డీఆర్‌ఎస్’ స్విమ్మర్..

ఖమ్మం స్పోర్ట్స్: విజయవాడలోని ఈ నెల 4వ తేదీన అక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన కృష్ణ రివర్ స్విమ్మింగ్ పోటీల్లో డీఆర్‌ఎస్ కళాశాలకు చెందిన కే.టీ.రాఘవేంద్ర రెండో స్థానంలో నిలిచాడు. కళాశాల నుంచి పాల్గొని రెండో స్థానంలో నిలువడంపై కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ వి.మోహన్‌రెడ్డి, చైర్మన్ వి.శోభరెడ్డి, ప్రిన్సిపాల్ టి.నాగేశ్వరరావులు అభినందించారు.

సన్మానం..



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని రుక్కితండాలో తాజా మాజీ సర్పంచ్ లకావత్ భీమానాయక్, పాలకవర్గాన్ని మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామాభివృద్ధికి వారు పాటుపడిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రుక్కితండా, రాయిగూడెం, బండిపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలకలో ఇటీవల మృతి చెందిన ఆడెపు రోషమ్మ కుటుంబసభ్యులకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ యండపల్లి సత్యం మంగళవారం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం రోషమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోయండపల్లి వెంకటేష్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేట ఆకేరు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతి ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో జల్లెపల్లి వద్ద అడ్డుకుని డ్రైవర్ పెద్దిరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు గర్హనీయం

కామేపల్లి: మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకుడు బాల్కసుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కామేపల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం పొన్నేకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి పని చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు మాటలు మాట్లాడిన, అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

‘రాష్ట్రాన్ని అప్పల కుప్పగా మార్చారు..’

ఖమ్మంవన్‌టౌన్: పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌లు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే ఖజానా అంతా ఖాళీ చేశారని మండి పడ్డారు. ఆర్థికభారం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతీ హామీని అమలు చేయడం ప్రారంభించిందని, బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కలిసి తమ గెలుపును అడ్డుకోలేవని పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	అంబాజీపేట మ్యారేజి బ్యాండ్
సాయిరాం	నా సామిరంగ
ఆదిత్య	బూట్‌కట్ బాలరాజు
శ్రీనివాస	కిస్మత్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

కామేపల్లి తహసీల్దార్ కార్యాలయం



గిర్దా‘వార్’..!

24 గ్రామ పంచాయతీలకు ఒకే ఉద్యోగి

- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్న వైనం
- కామేపల్లి వచ్చేందుకు ఆసక్తి చూపని ఉద్యోగులు
- దళారులను ఆశ్రయించి మోసపోతున్న విద్యార్థులు, రైతులు

కామేపల్లి: అన్ని ప్రభుత్వ శాఖల్లో అతి ముఖ్యమైన శాఖ రెవెన్యూ. అటువంటి శాఖలో సిబ్బంది కొరత వేధిస్తుంటే ఇక దరఖాస్తుదారుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కామేపల్లి మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇది వరకు ఇద్దరు గిర్దావర్‌లు పని చేసేవారు. గత ఆరు నెలల క్రితం ఇద్దరు కూడా బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో మరో ఇద్దరు గిర్దావర్‌లు వచ్చారు. గిర్దావర్-2 అవి నీతి ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యాన అతని ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తర్వాత గిర్దావర్-2గా సత్రు బాధ్యతలు చేపట్టాడు. గిర్దావర్-1 (లీవ్)గా ఉండడంతో తమ పనులు పూర్తికాక మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు నానాతంటాలు పడుతున్నారు. దేనికోసమైనా దరఖాస్తు చేసుకుంటే రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి గిర్దావర్‌ని నియమించాలని, స్థానిక ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే కామేపల్లి మండలానికి పని చేసేందుకు అధికారులు కూడా ఆసక్తి చూపడం లేదని సమాచారం.

ఇబ్బంది పడుతున్న సిబ్బంది..

దరఖాస్తుదారులు అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం కష్టంగా మారింది. గతంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు ఉంటే వారి నుంచి వివరాలను సేకరించి సర్టిఫికెట్‌ను అందించే వారు కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గిర్దావరే క్షేత్రస్థాయిలో వెళ్లి విచారణ చేయడం సాధ్యం కాకపోవడంతో పాటు పని భారం కూడా పెరిగి ఇబ్బంది పడాల్సి వస్తోంది.

డబ్బు ఇచ్చి మోసపోయా..



ఒక్కరే గిర్దావర్ ఉండడంతో అందరికీ సకాలంలో పనులు కావడం లేదు. దీంతో రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. తహసీల్ ఎదుట దళారులు కూడా పని చేస్తామని చెప్పడంతో వారిని ఆశ్రయించి డబ్బులిచ్చి మోసపోయా. ఇప్పటికీ పని కాలేదు.

– పబ్బతి సత్యనారాయణ, రైతు, పండితాపురం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఉన్న ఒక్క గిర్దావర్‌తో అందరి సమస్యను సకాలంలో తీర్చలేకపోతున్నాం. కాకపోతే సర్టిఫికెట్లను విచారించి విద్యార్థులకు మాత్రం ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ దళారులను ఆశ్రయించొద్దు. ఎవరైనా డబ్బులు అడిగినట్లు తెలిస్తే.. వారిపై చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్, తహసీల్దార్, కామేపల్లి

దళారులదే హవా..

మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, రైతులు, ప్రజలు తమ పని నిమిత్తం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వస్తుంటారు. కార్యాలయం ఎదుటే దళారులు తిష్ట వేసి తహసీల్‌కు వచ్చి పోయే వారిని మీరు ఏ పని నిమిత్తం వచ్చారు.. మీకు పని కాదు తమతోనే అవుతుందని మాయమాటలు చెప్పి వారి నుంచి ఎంతో కొంత నగదు వసూలు చేసి వారిని అక్కడి నుంచి పంపిస్తున్నారు. ఆతర్వాత అధికారుల వద్దకు వెళ్లి తమ బంధువులు అని, ప్రజాప్రతినిధి పంపించారని వారికి చెప్పి దళారులు పని చేయించుకుంటారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఆందోళనలో పాల్గొన్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

రఘునాథపాలెం: హెల్త్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హెల్త్ వర్కర్ల అసోసియేషన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండలంలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రమ్య, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.నవీన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. మంచుకొండ ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో పని చేస్తున్న హెల్త్ వర్కర్లకు గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతోవారి కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారాయన్నారు. జనాభా ప్రాతిపదికన హెల్త్ వర్కర్లకు విధులు కేటాయించాలని, ఆశా వర్కర్లకు పదవీ విరమణ 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చిరుద్యోగుల వేతనాల విడుదలపై దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను ఆశ వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంగ, సునీత, సరిత, వెంకట్ రమణ, సంతోషి, ధనమ్మ, విజయలక్ష్మి, రమాదేవి, వెంకటలక్ష్మి, అశ్విని, శ్రీలత, శ్రీలక్ష్మి, స్వర్ణలత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

మొదటి అదనపు జిల్లా కోర్టు పీపీ పునర్నియామకం

ఖమ్మం లీగల్: ఖమ్మం ఒకటో అదనపు జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొత్త వెంకటేశ్వరరావును తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఇటీవల తొలగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయగా, వెంకటేశ్వరరావు హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ మేరకు స్టే జారీ చేయడంతో ఆయన పీపీగా మంగళవారం మళ్లీ బాధ్యతలు స్వీకరించారు.

నేడు, రేపు సమ్మక్క, సారక్క జాతర

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు(బొక్కలగడ్డ) మున్నేరు బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో బుధ, గురువారాల్లో సమ్మక్క, సారలమ్మ జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ పూజారీ ఉప్పిసాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు పసుపుకుంకుమలతో డప్పు వాయిద్యాలు, శివశక్తుల నృత్యాలు, విన్యాసాలతో గద్దెపై కొలువు దీరుతారని తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు, వడి బియ్యం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ‘తమ్మినేని’ రాక

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల అనారోగ్యానికి గురైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో జరగనున్న జిల్లా జనరల్ బాడీ సమావేశానికి హాజరుకానున్నట్లు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

రేపు ఖమ్మంలో సెమినార్

ఖమ్మంమయూరిసెంటర్: అఖిలపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఈనెల 8న ఖమ్మంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సెమినార్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించాక ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ, బీఆర్‌టీయూ నాయకులు నరేశ్‌నాయుడు, తోట రామాంజనేయులు, కల్యాణం వెంకటేశ్వరరావు, జి.రామయ్య, ఎం.డీ.వై.పాషా మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు విప్లవ్‌కుమార్, గాదె లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాస్, పాల్వంచ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు రైతు సంఘం సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 8వ తేదీన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సమావేశం జరపనున్నట్లు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎజెండా అంశాలపై చర్చించి కార్యాచరణ తీసుకుంటామన్నారు.

11న సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 11వ తేదీన సాయంత్రం 5 గంటలకు ‘పాడుతా తియ్యగా చల్లగా’పేరిట సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్వరసుధ కల్చరల్ యూనిట్ అధ్యక్షుడు కొమ్మరాజు మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధుర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి, నటసార్వభౌమ ఎన్టీఆర్ 28వ వర్ధంతి, కవి కొమరాజు వెంకటేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు 12న ఇంటర్వ్యూ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతి బాపులే తెలంగాణ వెనుక బడిన తరగతుల మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి ఎస్ఎన్‌మూర్తి పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 12న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 55 శాతం మార్కులతో ఎంసీఏ, ఎంఎస్(కంప్యూటర్ సైన్స్), ఎంటెక్(కంప్యూటర్ సైన్స్) కలిగిన వారు అర్హులని, ఎన్‌ఈటీ, ఎస్‌ఎల్‌ఈటీ, ఎస్‌ఈటీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. వివరాలకు 98481 61319, 80194 22108 నంబర్లను సంప్రదించాలన్నారు.

12 నుంచి రామదాసు జయంతి ఉత్సవాలు

నేలకొండపల్లి: పరమ భక్తాగ్రేసరుడు కంచర్ల గోపన్న (భక్తరామదాసు) జయంతి ఉత్సవాలను ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, కలెక్టర్ సౌజన్యంతో నేలకొండపల్లి భక్తరామదాసు విద్వత్ కళాపీఠం వారి ఆధ్వర్యాన ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఈనేపథ్యాన ఉత్సవాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ నామా నాగేశ్వరరావులకు కమిటీ ప్రతినిధులు ఆహ్వానాలు అందించినట్లు విద్వత్ కళాపీఠం ప్రతినిధులు సాధు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తిలు పేర్కొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడుదాం

కామేపల్లి: విప్లవాల స్ఫూర్తిని నింపుకుని ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుదామని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య అన్నారు. మంగళవారం లాల్యతండాలో నిర్వహించిన దివంగత బానోత్ బద్యా సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ప్రజల హక్కుల కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి అమరులైన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, పోలెబోయిన ముత్తయ్య, కల్తీ రామచంద్రయ్య, బాణాల లక్ష్మణాచారి, పోలెబోయిన రవి, ఇమ్మడి గోపాలకృష్ణ, పడిగ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఖమ్మంరూరల్: రాష్ట్రంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్.బషీరుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వంపై నిరుద్యోగ యువత ఎన్నో ఆశలు పెట్టుకుందని గ్రూప్4, కానిస్టేబుల్ నోటిఫికేషన్లు వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. ఉద్యోగాలు భర్తీ చేసిన తర్వాత ఉద్యోగాలు పొందలేని వారికి ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు పి.మురళి, నరేశ్, అవినాశ్, నగేశ్, ప్రవీణ్, అరవింద్, వీరభద్రం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌కృష్ణయ్య ఆధ్వర్యాన డిమాండ్ల సాధనకై ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలకు కేంద్రం విధించిన క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తి వేయాలని, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి మోదేపల్లి కృష్ణమాచారి, జి.కృష్ణ, నీలం వెంకటేశ్, రామాచారి, అశోక్, రామకృష్ణ, ఖమ్మం నగర అధ్యక్షుడు వెంకటరామయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కంటి వైద్య శిబిరం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం మాక్స్ విజయ్ కంటి వైద్యశాల ఆధ్వర్యాన కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్సింహారావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంసహకారనగర్: విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడంలో గురువుల పాత్ర కీలకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఖమ్మంలో మంత్రిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈమేరకు విద్యాశాఖ పరిధిలో పలుచోట్ల అమలవుతున్న విధానాలను జిల్లాలోనూ అమలయ్యేలా చూడాలని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు విన్నవించగా.. ఉపాధ్యాయుల హక్కులు, ప్రయోజనాలను కాపాడడంలో తోడ్పాటునందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు దేవరకొండ సైదులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.వీరస్వామి, బి.నాగేశ్వరరావుతో పాటు టీపీయూఎస్, ఎస్‌టీఎఫ్, టీఆర్‌టీఎఫ్, ఆర్‌యూపీపీ బాధ్యులు రంగనాథ్, ఎం.వెంకటేశ్వర్లు, యాదగిరి, రాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



వినతి పత్రం అందిస్తున్న ఐద్వా ప్రతినిధులు

నేలకొండపల్లి: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టి ఇవ్వాలని ఐద్వా మండల కార్యదర్శి బెల్లం లక్ష్మి అన్నారు. ఈమేరకు మంగళవారం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరికావడంతో అవి లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. రేషన్ దుకాణాల ద్వారా 18 రకాల నిత్యావసర సరుకులు అందించాలని, పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని, నిత్యావసర ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాలు బలుసు ప్రమీల, మున్నంగి లక్ష్మి, కొప్పుల జానకి, విజయ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల కోసం పోరాడేది కేవీపీఎస్సే..



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: దళితుల హక్కుల కోసం గత 25 ఏళ్లుగా కేవీపీఎస్ పోరాడుతుందని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు పి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని నాయుడుపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు దళితవాడల అభివృద్ధి కోసం అత్యధిక నిధులు కేటాయించకపోవడంతో నేటికీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఖమ్మం నగరంలో జరగనున్నాయని పేర్కొంటూ.. సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నూకల బాలరాజు, రామనాథం, ఎన్.లక్ష్మయ్య, వి.రామనాథం, ఎ.వరకుమార్, ఆంతోని, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీపీఐ నాయకులు

కామేపల్లి: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కామేపల్లి సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యాన మంగళవారం కొత్తగూడెంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు అందేలా ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. పుచ్చకాయల కృష్ణయాదవ్, వెంకటేశ్వర్లు, కోటయ్య, శ్రీను, చిన్న వెంకటేశ్వర్లు, ఏపూరి లతాదేవి, వంకాయలపాటి ప్రసాద్, తిరుపయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలపై కక్షసాధింపు సరికాదు



ప్రజాపంథా నాయకులకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా ఉద్యమాలపై కక్షసాధింపు సరికాదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు పేర్కొన్నారు. ఇటీవల అరెస్టయి జిల్లా జైలుకు వెళ్లిన పార్టీ రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, నాయకులు తిమ్మిడి హనుమంతరావు, గద్దం లక్ష్మయ్య, జి.అశోక్, సునావత్ శ్రీనులు మంగళవారం జైలు నుంచి బెయిల్‌పై విడుదలవగా పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు విప్లవకారులపై పోలీసులు కక్షపూరిత వైఖరి మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నామల ఆజాద్, శ్రీనివాస్, కొల్లేటి నాగేశ్వరరావు, చందు, వెంకటేశ్, రాకేశ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

తిరుమలాయపాలెం: ఇటీవల అనారోగ్యానికి గురైతన స్వగ్రామం తెల్దార్‌పల్లి వచ్చిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను మంగళవారం సీపీఎం మండల నాయకులు కలిసి పరామర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు అంగిరేకుల నరసయ్య, వశపొంగు వీరన్న, బింగి రమేశ్, ధర్మాచారి, సత్యనారాయణ, అల్లి యశోద, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన నిరుపేదలకు సంచార ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు తెలిపారు. మంగళవారం ఖమ్మం చర్చి కాంపౌండ్‌లో ఉచిత వైద్య సేవలను ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఖమ్మంతో పాటు సింగరేణి మండలం ఎర్రబోలు గ్రామంలో ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హరినాథబాబు, నరసింహారావు, సంస్థ కార్యనిర్వాహణ అధికారి గుడిమళ్ల సూర్యప్రకాశరావు, రాష్ట్ర పరిశీలకులు సాధినేని జనార్దన్‌రావు, సభ్యులు గంటా ఉప్పలయ్య, మూలగుండ్ల శ్రీహరి, జెల్లా లక్ష్మీనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’కి ఆధారాలు అందించండి

నేలకొండపల్లి/కామేపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకానికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్, రేషన్ కార్డులతో పాటు ఫోన్ నంబర్‌ను అందించాలని నేలకొండపల్లి విద్యుత్ శాఖ ఏఈ కె.రామారావు, కామేపల్లి ఎంపీడీఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని తన చాంబర్‌లో ఏఈ, కామేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓలు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పొందుటకు మీ ఇంటికొచ్చే రీడింగ్ బిల్లర్‌కు మీ ఆధారాలు చూపిస్తే సరిపోతుందని, సొంతిళ్లు లేకపోయినా ఈ పథకానికి అన్నారు. ఒక వేళ ఇంటి వద్ద లేనిపక్షంలో ఒక పేపర్‌పై రాసి మీటర్ వద్ద ఉంచాలని సూచించారు. విద్యుత్ అధికారులకు వినియోగదారులు సహకరించాలన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



రఘునాథపాలెం: అభివాదం చేస్తున్న మండల నాయకులు

నేలకొండపల్లి/రఘునాథపాలెం/ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీటు, ప్రజాపంథా, మహిళా సమాఖ్య నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నేలకొండపల్లిలో అఖిల పక్షం ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో సీటు నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, రఘునాథపాలెంలో తక్కెళ్ల పార్టీ భద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకురాలు ఆవుల మంగతాయి, మండల కార్యదర్శులు నవీన్‌రెడ్డి, కేలోతు లక్ష్మణ్, శాఖమూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దీపక్ నాయక్, ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు పోటు కళావతి, తాటి నిర్మలలు మాట్లాడారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వివిధ ప్రజా సంఘాల నాయకులు గోపి, ఉపేందర్, ఎం.వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీనివాసరావు, కే.వీ.రెడ్డి, బొందయ్య, కె.పాపారావు, ధరావత్ లక్ష్మణ్, రవీందర్, ఇమామ్, సువర్ణ, రమ్య, సుజాత, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతునివ్వండి..

ఖమ్మంసహకారనగర్: ఈనెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ కమిటీని జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ నేతలు మంగళవారం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జాయింట్ మీటింగ్‌లో కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాషా, ఐఎన్‌టీయూసీ నాయకులు కేవీ రామారావు, గిరికుమార్‌లతో పాటు గుంటుపల్లి శ్రీనివాస్, జైపాల్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.